

సర్వేపై అవగాహన అవసరం

సమగ్ర కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 8లో ▸



వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.


- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.9 /17.9

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

రుణమాఫీ.. కాదేమీ!



అధికారంలోకి వస్తే పంట రుణాలు మాఫీ చేస్తామంటూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో ఆనందించిన అన్నదాతలకు నిరాశే మిగిలింది. సవాలక్ష కొర్రీలతో జిల్లాలో వేలాది మంది రైతులకు రుణమాఫీ పథకం వర్తించలేదు. రూ. 2లక్షలపైన ఉన్న క్రాప్‌లోన్‌ను అప్పులు చేసి మరీ చెల్లించిన పలువురు రైతులు.. నెలలు గడుస్తున్నా పంట రుణం మాఫీ కాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

- అర్హులందరి పంట రుణాలు మాఫీ చేస్తామన్న సర్కారు
- ఇప్పటివరకు నగం మందికే ప్రయోజనం
- రూ. 2 లక్షలఫైన ఉన్న అప్పు చెల్లించిన పలువురు రైతులు
- సర్కారు ప్రకటన కోసం ఆశగా ఎదురుచూపులు

■ రెడ్డిపేట గ్రామానికి చెందిన దూలం రాజిరెడ్డి కుటుంబానికి ఎస్‌బీఐలో రూ. 4 లక్షల క్రాప్‌లోన్ ఉంది. రూ. 2 లక్షలపైన ఉన్న రుణాన్ని చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని మాఫీ చేస్తామని సర్కారు చెప్పడంతో రెండు నెలల క్రితం కోడలు బంగారం అమ్మి అప్పు కట్టారు. ఇప్పటికీ మిగిలిన పంట రుణం మాఫీ కాలేదు. రుణమాఫీ కాకపోవడంతో రాజిరెడ్డి కుటుంబం ఇబ్బందిపడుతోంది. ఇది రాజిరెడ్డి కుటుంబ సమస్యే కాదు.. వేలాది మంది రైతుల సమస్య. ఒక్క రెడ్డిపేట గ్రామంలోనే సుమారు 60 మంది రైతులు రూ. 2 లక్షలకుఫైన పంట రుణం పొందారు. వారిలో చాలామంది రూ. 2 లక్షలఫైన ఉన్న మొత్తాన్ని చెల్లించి రుణమాఫీ కోసం నిరీక్షిస్తున్నారు.

రామారెడ్డి: జిల్లాలో 1,98,374 మంది రైతులు రూ. 1,283 కోట్ల మేర పంట రుణాలు తీసుకున్నారు. పంట రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక మూడు విడుతల్లో రుణమాఫీ అమలు చేసింది. అయితే వివిధ కారణాలతో జిల్లాలో సుమారు లక్షమంది రైతులకు రుణమాఫీ కాలేదు. జిల్లాలో సుమారు 92 వేలమంది రైతులకు సంబంధించిన రూ. 655 కోట్లు మాత్రమే మాఫీ అయ్యాయి. రేషన్ కార్డు లేకపోవడం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలలో పేర్లలో పొరపాట్లు, రూ. 2లక్షలకు పైగా పంట రుణాలు ఉండడం వంటి కారణాలతో వేలాది మందికి లబ్ధి చేకూరలేదు. దీంతో వారంతా అధికారుల చుట్టూ తిరగడంతో సర్కారు స్పందించి అర్హులందరికీ పంట రుణాలు మాఫీ అయ్యేలా చూస్తామని ప్రకటించింది. రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులు పైమొత్తాన్ని చెల్లించాలని సూచించింది. దీంతో చాలామంది అప్పులు చేసి మరీ రూ. 2 లక్షలపైన ఉన్న క్రాప్‌లోన్‌ను చెల్లించారు. నెలలు గడుస్తున్నా రుణమాఫీపై సర్కారు నుంచి స్పష్టత రాకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తానని సర్కారు మోసం చేసిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క రెడ్డిపేట గ్రామంలోనే రూ. 2 లక్షలపైన పంటరుణాలు తీసుకున్న వారు 60 మంది వరకు ఉన్నారు. వారిలో చాలా మంది రూ.2 లక్షలపైన ఉన్న క్రాప్‌లోన్ చెల్లించి సర్కారు ప్రకటన కోసం వేచిచూస్తున్నారు. వెంటనే రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పుస్తెలు అమ్మి అప్పు కట్టినం



రూ.2 లక్షలపైన ఉన్న బ్యాంకులోన్ కడితే మిగిలిన పంట రుణాన్ని మాఫీ చేస్తామని సర్కారు చెప్పింది. దీంతో పుస్తె బంగారం అమ్మి అప్పు కట్టినం. ఇప్పటికీ లోన్ మాఫీ చేయలేదు. ఎవరిని అడిగినా ఎప్పుడు చేస్తరో తెలియదంటున్నరు. వెంటనే క్రాప్‌లోన్‌ను మాఫీ చేయాలె.

– లక్ష్మి, రైతు, రెడ్డిపేట

అప్పుల పాలు చేశారు



కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చింది. నాకు బ్యాంకులో రూ. 2.53 లక్షల అప్పు ఉండె. రుణమాఫీ కోసం రూ. 53 వేలు బయట అప్పు తెచ్చి క్రాప్ లోన్ కట్టిన. రుణమాఫీ చేయకపోవడంతో అప్పులపాలైన. ఎప్పుడు మాఫీ చేస్తరో ఏమో..

– నడిపి లింబయ్య, రైతు, రెడ్డిపేట

నిధులొస్తున్నాయ్..!

- మంత్రి సీతక్కను కలిసిన షబ్బీర్ అలీ
- ప్రతిపాదిత రోడ్ల పనులకు నిధులివ్వాలని వినతి
- రూ.20 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి



మంత్రి సీతక్కతో సమావేశమైన షబ్బీర్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గ్రామీణ ప్రాంతాల రోడ్లను అభివృద్ధి చేసేందుకు అవసరమైన సీఆర్ఆర్ నిధుల మంజూరు కోసం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ రంగంలోకి దిగారు. బుధవారం ఆయన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, రూ.20 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని షబ్బీర్‌అలీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధికి అడ్డంకిగా మారిన రాజకీయాలపై బుధవారం 'సాక్షి'లో 'కామారెడ్డిపై శీతకన్ను' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. కామారెడ్డి నియోజకవర్గంలో అధికార, విపక్ష పార్టీల మధ్య ఆధిపత్య పోరు నడుస్తున్న నేపథ్యంలో అభివృద్ధికి నిధుల విషయంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల సీఆర్ఆర్ నిధుల కోసం స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి రూ.15 కోట్లతో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ రూ.10 కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చారు. అయితే ప్రభుత్వం రూ.5 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు రూ.15 కోట్ల చొప్పున మంజూరయ్యాయి. కామారెడ్డికి నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంపై 'సాక్షి'లో సమగ్ర కథనం ప్రచురితమవడంతో నేతల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్వయంగా మంత్రి వద్దకు వెళ్లి గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదించిన పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో మంత్రి స్పందించి రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. నిధుల మంజూరు కోసం ప్రయత్నించిన ప్రభుత్వ సలహాదారుకు పలువురు సామాజిక మాధ్యమాల ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..



కామారెడ్డిపై శీతకన్ను!

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాం పరిశీలన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. గోదాంలోని ఈవీఎంలు, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దులో విస్తృతంగా తనిఖీలు



మద్నూర్: రాష్ట్ర సరిహద్దులోని సలాబత్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం చెక్‌పోస్ట్ వద్ద అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. పక్క రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి వడ్లు రాకుండా ఈ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేశామని ఏవో రాజు తెలిపారు.

'పేద విద్యార్థులను చదువుకు దూరం చేయొద్దు'



కామారెడ్డి టౌన్: టీచర్ల అక్రమ డిప్యుటేషన్‌లను తక్షణమే రద్దు చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ డిమాండ్ చేశారు. అక్రమ డిప్యుటేషన్‌లతో విద్యార్థులు చదువులకు దూరమయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. దూరం ప్రాంతాలలోని స్కూళ్లకు వెళ్లడానికి ఇష్టంలేని కొందరు ఉపాధ్యాయులు అక్రమాలకు తెరలేపారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి అక్రమ డిప్యుటేషన్‌లకు సహకరించిన డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోర్చా జిల్లా కార్యదర్శి రవితేజ, ఉపాధ్యక్షుడు అర్బాస్, నాయకులు బుల్లెట్, శివ, శ్రావణ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలకు బయోమెట్రిక్



నిజాంసాగర్: ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ బయోమెట్రిక్ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. మంగళవారం మహమ్మద్‌నగర్‌లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. నిల్వ ఉన్న పురుగుల మందులు, కాంప్లెక్స్, యూరియా ఎరువుల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట నిజాంసాగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్, ఫర్టిలైజర్ దుకాణదారులు దుబ్బ వసంత్‌కుమార్, ఎలగందల వెంకటేశం, సీతాలే జనార్దన్, శిరిగిరి శివ తదితరులున్నారు.

అక్రమ డిప్యుటేషన్‌లను రద్దు చేయాలి

- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్



కామారెడ్డి టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్‌లపై సమగ్ర విచారణ జరపాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడ విధులు నిర్వహించాల్సిన టీచర్లు.. కుంటి సాకులతో తమకు అనుకూలమైన స్థానాలకు అక్రమంగా డిప్యుటేషన్లు వేయించుకుంటుండంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేసి మారుమూల ప్రాంతాల విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

విద్యాశాఖలో అక్రమాలు..



జిల్లా విద్యాశాఖలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు ఇచ్చారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలి. అక్రమ డిప్యుటేషన్ల ఉత్తర్వులు ఇచ్చిన డీఈవోపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.

– ముదాం అరుణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

డీఈవో సహకారంతోనే..



జిల్లాలో అవసరం లేకున్నా పలువురిని ఇతర స్కూళ్లకు డిప్యుటేషన్‌పై పంపించారు. డీఈవో సహకారంతోనే ఈ అక్రమాలు జరిగాయని అర్థమవుతోంది. జిల్లా విద్యాశాఖలో జరిగిన అక్రమ డిప్యుటేషన్‌లపై ఉన్నతాధికారులు స్పందించి, పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలి.

– ఆజాద్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

నిబంధనలు పాటించాలి



నిబంధనల ప్రకారం అవసరం ఉన్న పాఠశాలలకు మాత్రమే డిప్యుటేషన్లు వేయాలి. కానీ కొందరు టీచర్లు పైరవీలతో కోరుకున్న స్థానాలకు వెళ్లారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన డీఈవో వాటికి వత్తాసు పలకడం సరికాదు.

– జి.సురేశ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు



నిబంధనల ప్రకారం కచ్చితంగా ఉపాధ్యాయులు కావాల్సిన పాఠశాలలకు మాత్రమే డిప్యుటేషన్‌లు వేయాలి. కానీ జిల్లా విద్యాశాఖ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. దీనికి బాధ్యుడైన డీఈవోపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

– పి.శివప్రసాద్, జిల్లా కన్వీనర్, ఏఐఎస్ఎఫ్

సర్వేకు సర్వం సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వేళయ్యింది. బుధవారం సర్వే ప్రారంభం కానుంది. కులగణనతో పాటు కుటుంబ సభ్యుల ఆస్తిపాస్తులు, అప్పుల వివరాలతో సహా 75 అంశాలకు సంబంధించిన వివరాలను సర్వే సిబ్బంది నమోదు చేసుకోనున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.



తాడ్వాయిలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- నేటి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
- 2,400 మంది ఎన్యుమరేటర్లు, 230 మంది సూపర్‌వైజర్ల నియామకం
- మూడు రోజుల పాటు హౌస్ లిస్టింగ్
- 9 నుంచి సమగ్ర వివరాల సేకరణ
- కలెక్టర్ సంగ్వాన్ పర్యవేక్షణలో ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ స్థితిగతులతోపాటు కులం వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టింది. బుధవారం ప్రారంభమయ్యే సర్వే.. అరవై రోజుల పాటు కొనసాగనుంది. జిల్లాలో సర్వే కోసం 2,400 మంది ఎన్యుమరేటర్లను, 230 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఇప్పటికే హౌజ్ లిస్టింగ్, సర్వే కోసం నియమించిన సిబ్బందికి వివిధ స్థాయిల్లో శిక్షణ ఇచ్చారు. ఈనెల 6, 7, 8 తేదీలలో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఇంటి యజమాని పేరు, ఇంటి నంబరును లిస్టులో రాసుకుని, ఆ ఇంటికి స్టిక్కర్ అతికిస్తారు. ఈనెల 9 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడతారు. సూపర్‌వైజర్ తమకు కేటాయించిన ప్రాంతంలో పర్యటించి సర్వేను పర్యవేక్షిస్తారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో పాటు అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు సర్వేకు సంబంధించిన ఏర్పాట్లు, పర్యవేక్షణలో ఉన్నారు.

56 అంశాలు.. 75 ప్రశ్నలు..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు 56 అంశాలకు సంబంధించి మొత్తం 75 ప్రశ్నలు వేస్తారు. కుటుంబ యజమాని, కుటుంబ సభ్యులు, కులం, కులానికి సంబంధించిన ఇతర పేర్లు, వయసు, మాతృభాష, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు, వైకల్యం ఉంటే వివరాలు, వైవాహిక స్థితి, చదువు, చదివిన మాధ్యమం, బడి మానేస్తే ఏ తరగతిలో మానేశారు అన్న వివరాలను నమోదు చేసుకుంటారు. ప్రస్తుతం చేస్తున్న పని, ఉద్యోగం, వృత్తి, కులవృత్తులు తదితర వివరాలను సేకరిస్తారు. కుటుంబానికి సంబంధించిన ఆస్తులు, బ్యాంకు అప్పుల వివరాలు నోట్ చేసుకుంటారు. రిజర్వేషన్ వల్ల పొందిన విద్య/ఉద్యోగ ప్రయోజనాలు, ఐదేళ్లలో లబ్ధిపొందిన పథకాల పేర్లు, రాజకీయ, ప్రభుత్వ పదవులు, వలసల వివరాలు తెలుసుకుంటారు. కుటుంబానికి చెందిన పశుసంపద, స్థిరాస్తి వివరాలు, రేషన్‌కార్డు నంబరు, ఇంటి విస్తీర్ణం, ఇల్లు రకం, తాగునీటి వనరు, వంట కోసం ఉపయోగించే ఇంధనం తదితర వివరాలను నమోదు చేసుకుంటారు.

పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం/తాడ్వాయి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం తాడ్వాయి మండల కేంద్రంతో పాటు కామారెడ్డి పట్టణంలోని కళాభారతిలో సర్వేపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు తప్పనిసరిగా తమకు కేటాయించిన అన్ని ఇళ్లకు వెళ్లి, ఎన్ని కుటుంబాలు ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. 6, 7, 8 తేదీలలో కుటుంబ యజమానుల పేర్లను సేకరించి ఆ ఇళ్లకు స్టిక్కర్లను అతికించాలన్నారు. సర్వే చేసేటప్పుడు ఏవైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లను సంప్రదించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సీపీవో రాజారాం, తాడ్వాయి ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీవో సవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



తాండూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/లింగంపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన ఎల్లారెడ్డి మండలంలోని శివాపూర్, నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్, లింగంపేట మండల కేంద్రం, మెంగారం గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమాలలో ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్లు మహేందర్ కుమార్, శ్రీనివాస్‌రావు, నరేందర్, ఏఎంసీ చైర్మన్ మారెడ్డి రజితారెడ్డి తదితరులున్నారు.

త్రిలింగేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేస్తా

నాగిరెడ్డిపేట: తాండూర్ శివారులోని పురాతన త్రిలింగేశ్వరాలయ అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం త్రిలింగేశ్వరాలయాన్ని సందర్శించారు. స్థానికులతో మాట్లాడి ఆలయ చరిత్ర గురించి తెలుసుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజితరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, ఎంపీడీవో ప్రభాకర్‌చారి, సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి తదితరులున్నారు.

నాగన్నగారి మెట్ల బావి పరిశీలన



మెట్ల బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

లింగంపేట: మండలకేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావిని మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సందర్శించారు. టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయడం కోసం కాటేజ్‌లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపాలని మండల అధికారులకు సూచించారు. బావిలో చెత్తను తొలగించాలని, చుట్టుపక్కల మొక్కలు నాటి సంరక్షించాలని పేర్కొన్నారు. బావిని సందర్శించడానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. చారిత్రక బావుల గురించి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు చరిత్రను అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో ప్రభాకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, ఇన్‌చార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి నరసింహారావు, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేశ్, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సీఈవో పెంటయ్య ఉన్నారు.

'నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి'

కామారెడ్డి అర్బన్ : అన్ని కేటగిరీల వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయడానికి అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వరంగల్ ఎన్పీడీసీఎల్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఎస్ఈ మాధవరావు, జిల్లా ఎస్ఈ రమేశ్‌బాబు సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో జిల్లా అధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలంబాటలో అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు, భద్రత ప్రమాణాలు, కొత్త విద్యుత్ కనెక్షన్లు, విరిగిపోయిన స్తంభాల స్థానాల్లో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం, వదులుగా ఉన్న లైన్లను సరిచేయడం, లోడ్‌కు తగిన విధంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద టోల్ ఫ్రీ నంబర్ల(1912, 1800 425 0028) వివరాలు ఉండాలన్నారు. సమావేశంలో విద్యుత్ అధికారులు ప్రభాకర్, కల్యాణ చక్రవర్తి, విజయసారథి, రాజశేఖర్, వెంకటేశ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

క్లుప్తంగా

ప్రవాసుల ఔదార్యం.. రూ.3.8 లక్షల సాయం



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి అయిండ్ల విష్ణు గతేడాది డిసెంబర్ 12న సౌదీ అరేబియాలో అనారోగ్యంతో మృతి చెందాడు. అక్కడి అన్సాబ్ కంపెనీలో పని చేస్తున్న లచ్చాపేట గ్రామానికి చెందిన బూస రాజు, అశోక్, పాలమాకుల శేఖర్ గౌడ్, అవుసునూరి చంద్రం, స్వామిగౌడ్ చేయి చేయి కలిపారు. విరాళాలు సేకరించారు. సేకరించిన మొత్తం రూ.3.8 లక్షలకు సంబంధించిన చెక్కును మంగళవారం ప్రవాసుల తరఫున బూస అశోక్ కుటుంబానికి అందజేశారు. విష్ణు కుటుంబానికి బాసటగా నిలిచిన ప్రవాసులకు ఇసాయిపేట గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పాల్వంచ విద్యార్థిని



మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని దుర్గ లక్ష్మి 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 బాలికల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టు నుంచి నల్గొండపై గెలుపొంది మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు మంగళవారం ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, పీడీ అతీఖుల్లా, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి రూరల్/రాజంపేట: నిర్దిష్టమైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి.విక్టర్ అన్నారు. మంగళవారం కామారెడ్డి మండలంలోని లింగాయిపల్లి, రాజంపేట మండలంలోని కొండాపూర్, గుండారం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ధాన్యంలోని చెత్తను తొలగించి తీసుకురావాలని రైతులకు చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల్లో ఆయా రైస్ మిల్లులకు తరలించాలని సెంటర్ ఇన్‌చార్జిలను ఆదేశించారు. రాజంపేట మండల ప్రత్యేక అధికారి అపర్ణ, తహసీల్దార్ అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.



లింగాయిపల్లిలో వరిధాన్యం సెంటర్ ఇన్‌చార్జీలకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

పిట్లం(జుక్కల్): రైతులు ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు తరలించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. ఆయన మంగళవారం బొల్లక్‌పల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకార్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఏఈవో ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేపై అవగాహన ఉండాలి

బాన్సువాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, సమగ్ర, ఇంటింటి కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు పూర్తిస్థాయి శిక్షణ తీసుకోవడంతో పాటు ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం ఎన్యుమరేటర్లకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చివరి కుటుంబం వరకు అందేందుకు దోహదపడుతుందన్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్, ప్రతి 10 మంది ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించనున్నట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా సర్వే జరుగుతుందన్నారు. జిల్లా, మండల కోడ్‌లను కచ్చితంగా నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రశ్నావళి ఆధారంగా ఇంటినెంబర్, యజమాని, సభ్యులు వంటి వాటిని 100 శాతం నమోదు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేస్తూ ఎన్యుమరేటర్ల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. అంతకు ముందు సూపర్‌వైజర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్యుమరేటర్లకు దిశానిర్దేశం చేశారు. డీఈవో రాజు, ఎంపీడీవో బషీరుద్దీన్, ఏఎస్‌వో కిషన్ నాయక్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఎంఈవో నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

సంక్షిప్తం

పశువులకు టీకాలు తప్పక వేయించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): అన్నిరకాల పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రమేశ్ అన్నారు. కరడ్‌పల్లిలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్స అందించారు. గాలికుంటు రోగం వస్తే పాల ఉత్పత్తి తగ్గుతుందని, కట్టిన పశువులు ఇడచుకుపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా 1,006 గేదెలు, ఆవులకు టీకాలు వేశారు. డాక్టర్లు రమేష్, అనూష, పాలకేంద్రం అధ్యక్షుడు నారాయణరెడ్డి, సిబ్బంది పోచయ్య, కొండల్‌రెడ్డి, ప్రేంసింగ్ పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్మాగ్రహ దీక్ష



కామారెడ్డి టౌన్: ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం 'ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష' చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రాఘవరెడ్డి, సంతోష్‌కుమార్‌లు మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన నాలుగు డీఏలు, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్సీ అమలు చేయాలని కోరారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో ధర్మాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు, హక్కుపై అవగాహన

కామారెడ్డి అర్బన్: డిగ్రీ పాసైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటు నమోదు, శాసనమండలి, పట్టభద్రులు బాధ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే అధ్యాపకులు సైతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ.చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

- క్వింటాలుకు 3 కేజీల తరుగు తీస్తున్న కొనుగోలు కేంద్రం నిర్వాహకులు

బాన్సువాడ రూరల్: కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసే వరిధాన్యం ఒక సంచికి కేవలం 600 గ్రాములు మాత్రమే అదనంగా కాంటా వేయాలని కామారెడ్డి కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్ ఆదేశాలు జారీ చేశారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కొనసాగుతున్నాయి. బాన్సువాడ మండలం బుడిమిలో మంగళవారం జిన్న పెద్దోల్ల ఆంజనేయులుకు చెందిన ధాన్యాన్ని బీహార్ ప్రాంత కూలీలు కాంటా వేశారు. 40 కేజీల సంచికి ఒక కేజీ 600 గ్రాములు అదనంగా తూకం వేశారు. దీంతో రైతులు క్వింటాలుకు రెండున్నర కిలోలు నష్టపోతున్నారు. తాడ్కోల్ సొసైటీ అధికారులు, సిబ్బంది సూచన మేరకే అదనంగా తూకం వేస్తున్నట్లు హమాలీలు తెలిపారు. పూర్తిగా ఎండిన ధాన్యానికి తరుగు పేరిట క్వింటాలుకు రెండున్నర కిలోల చొప్పున తీస్తున్న ధాన్యం విలువ ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం రూ.60 అవుతోంది. ఒక్కో రైతు సరాసరి 30 క్వింటాళ్లు అమ్ముకుంటే రూ.1800 చొప్పున నష్టపోతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



బుడిమి గ్రామంలో తూకం వేసిన వడ్ల సంచి

లీకేజీలకు మరమ్మతులు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ పాత చెరువు తూము ద్వారా వృథాగా పోతున్న నీటికి మంగళవారం వరి గడ్డి మోపులను అడ్డుగా పెట్టి నీటి వృథాను అరికట్టారు. పాత చెరువు కుడి, ఎడమ పంట కాలువలకు సాగు నీరందించే తూములు దెబ్బతిన్నాయి. పంట కాలువల తూములు సక్రమంగా లేకపోవడంతో బుంగల ద్వారా నీరు వృథా అవుతోంది. దీంతో రైతులు, వృథా నీటిని అరికట్టాలని నీటిపారుదలశాఖ అధికారులను కోరారు. ఈ మేరకు స్పందించిన నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ నీటిపారుదలశాఖ సిబ్బందితో వరిగడ్డిని అడ్డుగా పెట్టించి వృథా నీటికి అడ్డు కట్ట వేశారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి



భిక్కనూరు: దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు బైండ్ల భూపతి అన్నారు. మంగళవారం ఆయనను కాచాపూర్‌లో డీసీసీబీ మాజీ డైరెక్టర్ లింగాల కిష్టాగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బైండ్ల భూపతి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి దివ్యాంగుడికి అందేలా కృషిచేయడంతో పాటు వారి సంక్షేమం కోసం పాటుపడుతానన్నారు. కాంగ్రెస్ కమిటీ గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింగ్ రావు, నేతలు నీలంరెడ్డి, జీవన్‌రెడ్డి, రాజాగౌడ్, సాయిలు, శ్యామల పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తొమ్మిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు



నందిపేట్: మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన కొమిరే సుధాకర్‌పై దాడికి పాల్పడిన 9 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని చిలుకల చిన్నమ్మ ఆలయ సమీపంలో షాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య అనే వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడనే సమాచారం మేరకు కొమిరె సుధాకర్ మరో ముగ్గురితో కలిసి ఘటన స్థలానికి వెళ్లాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లయ్యని ఆస్పత్రికి తరలించి ప్రమాదానికి కారణమైన వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఆలయం వద్ద పండుగ చేసుకునే కొందరు సుధాకర్‌పై దురుసుగా ప్రవర్తించి, కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారు. దీంతో సుధాకర్ కాలు విరగడంతో పాటు పలుచోట్ల గాయాలయ్యాయి. బాధితుడు సుధాకర్ ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై అట్రాసిటీ కేసుతోపాటు పలు సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు..

దోమకొండ: మండల కేంద్రంలో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గొలుసుల మహేశ్ ఇంటికి ఈనెల 4న రాత్రి తన మేనమామ కుమార్తె శ్యామల వచ్చింది. అదే సమయంలో మేనమామ కుమారుడు పల్లపు రమేశ్ ఈ ఇంటికి ఎందుకు వచ్చావని ఆమెను తిడుతుండగా మహేశ్ అడ్డుగా వెళ్లాడు. దీంతో రమేశ్ మహేశ్‌పై కారం చల్లి కర్రతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు

నాగిరెడ్డిపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సదరు బాలుడు అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లారెడ్డి పేర్కొన్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడి అరెస్ట్

రుద్రూర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్ మండలం బొప్పాపూర్‌కు చెందిన ముజీబ్ అనే యువకుడు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రేమ పేరుతో లోబరుచుకుని తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధిత యువతి ముజీబ్ ఇంటికి రాగా తాళం వేసి పారిపోయాడు. బాధితురాలు ఈనెల 30న పీఎస్‌లో ఫిర్యాదు చేసి ప్రియుడి ఇంటి వద్ద బైఠాయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పట్టణ పీఎస్‌లో 79 వాహనాలు

కామారెడ్డి క్రైం: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వివిధ కారణాల చేత వదిలివేయబడిన 79 వాహనాలు ఉన్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయా వాహనాలకు సంబంధించిన యజమానులు రాకపోవడంతో తదుపరి చర్యల గురించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పీఎస్‌లో ఉన్న వాహనాల యజమానులు వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. లేకుంటే వాహనాలను మరికొన్ని రోజుల్లో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



సాయిరెడ్డి మృతదేహం

తాడ్వాయి: అప్పుల బాధతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలం దేవాయిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన టేకుల సాయిరెడ్డి(47) ఇటీవల నూతన ఇంటిని నిర్మించాడు. ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తితో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాగుడుకు బానిసై యువకుడు..

దోమకొండ: తాగుడుతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దోమకొండ మండల కేంద్రంలో చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొత్త నరేశ్(30) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. అంతేకాకుండా అతను కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తితో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరికోత యంత్రానికి తప్పిన ప్రమాదం

నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం గేటు వద్ద మంగళవారం ఉదయం వరికోత యంత్రానికి ప్రమాదం తప్పింది. ఐచర్ వాహనంలో వరికోత యంత్రాన్ని తరలిస్తున్నారు. హైదరాబాద్–బోధన్ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణానికి తవ్విన గుంతలోకి ఐచర్ వాహనం మట్టిలోకి జారుకుంది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో వాహనం గుంతలోకి వెళ్లకుండా మట్టిలో కూరుకుపోయింది. అక్కడే హైవే పనులు చేపడుతున్న గుత్తేదారు జేసీబీ, క్రేన్‌లను తెప్పించి వాహనాన్ని బయటకు తీయించారు. గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది.



క్రేన్, జేసీబీ సాయంతో వరికోత యంత్రాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

కామారెడ్డిలో చైన్ స్నాచింగ్

కామారెడ్డి క్రైం: బైక్‌పై వెళ్తున్న ఓ జంటను వెంబడించి దుండగులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అడ్లూర్ గ్రామానికి చెందిన కుంబాల రాజు, సౌమ్య దంపతులు. వీరు బైక్‌పై కామారెడ్డి నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా జయశంకర కాలనీ వద్దకు రాగానే వెనుక నుంచి మరో బైక్‌పై ఇద్దరు అగంతకులు వెంబడించారు. బ్రిలియంట్ స్కూల్ సమీపంలోకి రాగానే సౌమ్య మెడలో నుంచి మూడు తులాల గొలుసును బైక్‌పై వెనుక కూర్చున్న దుండగుడు లాక్కుని పరారయ్యారు. సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బిచ్కుంద: మండలంలోని హజ్గుల్‌లో మంజీర నుంచి సోమవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సీఐ నరేశ్ పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఆరు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు.

వెండి ఆభరణాలు పట్టివేత



బిచ్కుంద: మండల కేంద్రంలో వెండి ఆభరణాలను పట్టుకున్నట్లు సీఐ నరేశ్ మంగళవారం తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి బిచ్కుందలో వెండి ఆభరణాలను జీరో బిల్లుతో అమ్ముతున్నట్లు తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సదరు వ్యక్తి వద్ద ఉన్న కారును తనిఖీ చేయగా వెండితో తయారు చేసిన దీపాలు, ఉంగరాలు, కాళ్ల పట్టిగొలుసులు లభించాయి. సుమారు 6 కిలోల వరకు వెండి ఉండడంతో దీనికి సంబంధించిన బిల్లులు చూయించాలని అడిగితే ఎలాంటి బిల్లులు చూయించలేదు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కామారెడ్డి ట్రెజరీ కార్యాలయంలో ఆభరణాలను అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నవీపేట: ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేట మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన గుంజె లక్ష్మణ్(75) గత నెల 20న నిజామాబాద్ వైపు ఆటోలో వెళ్తుండగా ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో లక్ష్మణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు యువకుడు..

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన మందముల జీవన్(35) అనే యువకుడు సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందినట్లు ఎస్సై ఎల్ రామ్ మంగళవారం తెలిపారు. ఇంట్లో స్నానం కోసం వేడి నీళ్ల బకెట్ తీసుకొని బాత్‌రూంలోకి వెళ్తుండగా కాలుజారి కింద పడటంతో తలకు బలమైన గాయాలై మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం బస్తాలు పడి ఒకరికి గాయాలు

మోపాల్: మండలంలోని మంచిప్పలో లారీలోని ధాన్యం బస్తాలు పడి గ్రామానికి చెందిన రాజయ్యకు మంగళవారం స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో ధాన్యం బస్తాలను లోడ్ చేసుకుని వెళ్తున్న లారీ నుంచి అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటున్న వెళ్తున్న రాజయ్యపై ధాన్యం బస్తాలు పడ్డాయి. ఈ ఘటనలో అతనికి స్వల్ప గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన బండారు నరేందర్ మంగళవారం బ్యాంకుకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా బైక్ ఢీకొని గాయాలైనట్లు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. బాధితుడు నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన బల్ల సాయికుమార్ ఈనెల 2న అంచనూరు గ్రామానికి కూలీ పనికి వెళ్లి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా టీవీఎస్ ఎక్సెల్ అతివేగంగా వచ్చి ఢీకొన్నట్లు ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. దీంతో సాయికుమార్‌కు గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రాణాలు కాపాడిన డయల్-100

బాల్కొండ: ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత, ఇద్దరు పిల్లలను మెండోరా పోలీసులు మంగళవారం కాపాడారు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత తన భర్త వేధింపులు తాళలేక ఇద్దరు పిల్లలతో కలిసి మెండోరా మండలం పోచంపాడ్‌లో ఉన్న ఎస్సారెస్పీలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చింది. ప్రాజెక్టుపై అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళ, పిల్లలను గమనించిన పర్యాటకులు వెంటనే డయల్–100కు ఫోన్ చేశారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సదరు మహిలకు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మెడికల్ షాపులో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని వరణ్య మెడికల్ షాపులో దొంగతనం జరిగినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఎస్‌హెచ్‌వో మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ముగ్గురు దుండగులు రెండు బైక్‌లపై వచ్చి మెడికల్ షాప్‌లో చొరబడి రూ.5 లక్షల నగదు దొంగిలించినట్లు పేర్కొన్నారు. మెడికల్ యజమాని గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

FINANCIAL SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర॥ 9440863470. [W-1264010]

PASSPORT MISSING

■ ANKAM GANESH, S/o. ANKAM NARAYANA, చేపూర్ ఇ.నెం. 4-74/1 ఆర్మూర్ బస్టాండ్ నుండి చేపూర్‌కు బైక్ పై వెళ్తుండగా V2559330 నెం. గల పాస్‌పోర్ట్ పోయినది. దొరికినవారు సం॥ 8179954121. [Z-1203567]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253908]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలి. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663. [SCA24000542]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.